సాక్షి ఖమ్మం

సోమవారం : 30 : జనవరి : 2023



ప్రభుత్వ డెయిరీలో ప్రక్షాళన

ఖమ్మం విజయ డెయిరీలో పాలు, పాల పదార్థాలు పక్కదారి పట్టిన వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. 10లో



నేడు సింగరేణి డైరెక్టర్ల ఎంపిక

సింగరేణి డైరెక్టర్ పోస్టుల నియామకానికి హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 18°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎగ్జిబిషన్‌ను సందర్శించిన కలెక్టర్



కూతురుకు బొమ్మలు కొనిస్తున్న కలెక్టర్

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్తంభాద్రి ట్రేడ్ ఫెయిర్ ఫెస్టివల్ ఎగ్జిబిషన్‌ను ఆదివారం రాత్రి కలెక్టర్ వీపీ గౌతమ్ సతీసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌లో వివిధ ప్రదర్శనలను తిలకించి, ఆట వస్తువులను పరిశీలించారు.

జెడ్పీ గోడౌన్‌కు ఈవీఎంలు



స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచిన ఎన్నికల సామగ్రి

ఖమ్మం సహకారనగర్ : పాత కలెక్టరేట్‌ను మెడికల్ కళాశాలకు కేటాయించటంతో ఆ ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను సైతం మార్చు చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో జిల్లా పరిషత్ ఆవరణలోని గోడౌన్‌లోకి ఈవీఎంలు, ఇతర సామగ్రిని తరలిస్తున్నారు. ఆదివారం ఈ ప్రక్రియను కలెక్టర్ వీపీ గౌతమ్ పర్యవేక్షించగా.. అదనపు కలెక్టర్ మధుసూదన్ దగ్గరుండి పనులు చేయించారు. ఎట్టకేలకు రాత్రి వరకు సామగ్రి అంతా స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చి వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో గోడౌన్‌కు తాళం వేశారు.

విద్యాశాఖ వెబ్‌సైట్ అందుబాటులోకి తేవాలి

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు నిర్వహిస్తున్న క్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌ను డెవలప్ చేయకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని, తక్షణమే వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తేవాలని పీఆర్‌టీయూ (తెలంగాణ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్టా శ్రీనివాసరావు, కొమ్మినేని అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. వెబ్‌సైట్ అందుబాటులో లేకపోవడంతో కేటగిరీల వారీగా పెడుతున్న లిస్టులు ఎక్కడ చూడాలో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

ఖమ్మం సహకారనగర్ : జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయని పరీక్షల సిటీ కో ఆర్డినేటర్ పార్వతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పరీక్షకు 458 మందికి గాను 454 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 449 మందికి గాను 447 హాజరయ్యారని వివరించారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండలంలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. దీంతో ప్రాజెక్టు పరిసరాలు కోలాహలంగా మారాయి. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని వీక్షించిన పర్యాటకులు.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 505 మంది పర్యాటకులు తరలి రావడంతో వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.18,365, 300 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ,14,960 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రేరణ అంతంతే..



సౌకర్యాలు లేక ఇబ్బంది పడిన విద్యార్థులు

- మానసిక నిపుణుడు లేకుండానే 'మమ' అనిపించిన అధికారులు
- పట్టించుకోని డివిజన్ అధికారి

ఖమ్మంమయూరిసెంటర్ : పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు ప్రతి ఏడాది ప్రేరణ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. మానసిక నిపుణులు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్ పాఠ్యాంశాల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. డిసెంబర్‌లోనే ఈ ప్రేరణ కార్యక్రమం నిర్వహించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల సాక్షిలో 'ప్రేరణ లేదు' శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందనగా ఆదివారం ఎస్సీ సంక్షేమ అధికారులు జిల్లాలో ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం డివిజన్‌కు సంబంధించి 14 వసతిగృహాల్లో పదో తరగతి విద్యార్థులు ఉండగా వారికి ఖమ్మంలోని ఎస్‌ఎస్‌పీ క్యాంపులో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం చేపట్టారు. మధిర డివిజన్ విద్యార్థులకు వైరాలో, సత్తుపల్లి డివిజన్ విద్యార్థులకు సత్తుపల్లిలో ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అయితే ప్రేరణ ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించడంతో డివిజనల్ అధికారులు తూతూ మంత్రంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి ప్రణాళిక లేకుండా ఏర్పాటు చేయడంతో తరగతి గదిలో విద్యార్థులు కొంత అసౌకర్యానికి లోనయ్యారు.

సౌకర్యాలు లేమి..

ప్రతి ఏడాది ఖమ్మం డివిజన్‌లో ప్రేరణ తరగతులు నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించేవారు. ఈ ఏడాది ఎస్‌ఎస్‌పీలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయగా.. అక్కడ బాత్‌రూమ్‌లకు తాళాలు వేసి ఉండడంతో విద్యార్థినిలు పక్కనున్న వసతిగృహాలకు వెళ్లాల్సి వచ్చింది. ఇక తరగతి గదిలోనూ సరైన సౌకర్యాలు లేకపోవడంతో పాటు మొదట నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా సబ్జెక్ట్‌లను మార్చి చెప్పించడంతో కొంత ఇబ్బందులు పడ్డారు.

సాయంత్రం వరకు సెర్పింగే..

ప్రేరణ కార్యక్రమంలో మానసిక నిపుణుడిచే విద్యార్థులను ప్రేరేపించడం చాలా ముఖ్యమైనది. కార్యక్రమ నిర్వహణకు వారం రోజుల ముందే హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులతో పాటు మోటివేషన్‌కు మానసిక నిపుణులు ఎవరితో చెప్పించాలని అనే దానిపై అధికారులు ఒక నిర్ణయానికి రావాలి. అయితే ఈ ఏడాది డివిజనల్ అధికారిణి నిర్లక్ష్యంతో ప్రేరణ కార్యక్రమం ప్రారంభమయ్యేంత వరకు మానసిక నిపుణుడిని ఏర్పాటు చేయలేదు. కార్యక్రమం ముగిసే ముందు వసతిగృహ సంక్షేమ అధికారులు హడావిడిగా ఓ మోటివేటర్‌ను సంప్రదించి, తూతూ మంత్రంగా ముగించారు.

30 మంది వరకు గైర్హాజరు..

ఖమ్మం డివిజన్‌లో నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి 30 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డివిజన్‌లో 14 వసతిగృహాల్లో 154 మంది విద్యార్థులు ఉన్నారని, అయితే ప్రేరణకు 124 మంది మాత్రమే హాజరయ్యారని డివిజన్ అధికారిణి తెలిపారు. వసతిగృహాల్లో ఉంటూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులను ఈ కార్యక్రమానికి తప్పకుండా తీసుకరావాల్సిన బాధ్యత వసతిగృహ సంక్షేమ అధికారులదే. అయినా వారు విద్యార్థులను తరలించడంలో నిర్లక్ష్యం వహించారు. ఇక విద్యార్థులు 30 మంది గైర్హాజరు కాగా.. ఏఎస్‌డీడీఓ మాత్రం అందరూ వచ్చారని విలేకరులకు చెప్పడం గమనార్హం. ఇక ప్రేరణ కార్యక్రమంలో సౌకర్యాల లేమి, మానసిక నిపుణుడిని ఏర్పాటు చేయకపోవడంపై ఖమ్మం డివిజన్ ఏఎస్సీడీఓ శ్రీలతను వివరణ కోరగా ప్రేరణ కార్యక్రమంలో ఎవరైనా బోధించవచ్చని, వారికి సబ్జెక్ట్ అవసరం లేదని తెలిపారు. అంబేడ్కర్ భవనం ఖాళీగా లేనందున పాఠశాలలో ఏర్పాటు చేశామని చెప్పారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



వైరాలో మాట్లాడుతున్న సత్యనారాయణ

వైరా: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదివే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఆదివారం వైరా ఎస్సీ బాలికల వసతి గృహంలో మధిర డివిజన్ వసతి గృహాల విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగు, హిందీ, గణితం, సైన్స్ సబ్జెక్టలలో వెనక బడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి మంచి గ్రేడ్ పాయింట్లు వచ్చేలా హాస్టల్ వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ ఏడాది 537 మంది వసతి గృహాల విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని, చదువులో వెనకబడిన వారికి ప్రత్యేక తరగతులు, ట్యూటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గత ఏడాది 96.4 శాతం ఫలితాలు సాధించామని, ఈ ఏడాది అంతకంటే మంచి ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వసతిగృహాల సంక్షేమాధికారి కొత్త వెంకటేశ్వరరావు, వార్డెన్లు నాగశివ స్వప్న, అత్రిత్‌ఉన్నీసా బేగం, హసీనా, వరలక్ష్మి, శరత్, దశరథ్, ప్రభాకర్, వీరన్న, వేణు, మల్లారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలే లక్ష్యం

సత్తుపల్లిటౌన్: జిల్లాలోని ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో 537 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారని, ఈ ఏడాది నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్సీ అభివృద్ధి శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ అన్నారు. సత్తుపల్లి ఇంటిగ్రేటెడ్ బాలికల వసతి గృహంలో ఆదివారం డివిజన్‌లోని ఎస్సీ హాస్టళ్ల పదో తరగతి విద్యార్థులకు పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతేడాది 13 హాస్టళ్లలో పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించారని, 18 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారని చెప్పారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలతో పాటు నోట్స్‌లు ఇచ్చామని, ట్యూటర్లను నియమించామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ పి.లక్ష్మీనారాయణ, హెడ్‌డబ్ల్యూఓలు బజ్జూరి వెంకటేశ్వరరావు, ఎస్‌కె దారుగాబి, చింతకాయల కృష్ణ, కె.సుశీల, పి.సుజాత, పి.కృష్ణ, స్టాలిన్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

పదోన్నతుల జాతర



ఉపాధ్యాయులతో కళకళలాడుతున్న పాత డీఈఓ కార్యాలయం

పాత డీఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల సందడి

ఖమ్మం సహకారనగర్ : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. సుమారు ఏడున్నర సంవత్సరాల తర్వాత ఉపాధ్యాయుల పదోన్నతులకు అవకాశం రావడంతో స్కూల్ అసిస్టెంట్లు(ఎస్‌ఏ)గా పదోన్నతుల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులంతా ఆదివారం పాత డీఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియ అంతా అక్కడి నుంచే నిర్వహిస్తుండడంతో సందడి నెలకొంది.

ముమ్మర ఏర్పాట్లు..

షెడ్యూల్ ప్రకారం రెండు రోజుల క్రితం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఆ తర్వాత పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓల ధ్రువీకరణలతో డీఈఓ కార్యాలయంలో సంబంధిత పత్రాలను సమర్పించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డీఈఓ సోమశేఖర శర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

12 కౌంటర్లు..

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సబ్జెక్టుల వారీగా 12 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో కౌంటర్‌లో ముగ్గురు సిబ్బందిని నియమించారు. ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ) పదోన్నతుల కోసం లోకల్ బాడీస్ పాఠశాలల నుంచి 296 మంది, ప్రభుత్వ పాఠశాలల నుంచి 26 మంది హాజరై సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకున్నారు. 135 అప్పీళ్లు.. ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ జరుగుతుండగా 135 మంది ఉపాధ్యాయులు లిస్టులో తమ పేరు రాలేదని, కొన్ని తప్పుగా నమోదయ్యాయని పలు అంశాలను ప్రస్తావిస్తూ అధికారులకు అప్పీళ్లను అందజేశారు. వీరి వివరాలను పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు సమాధానం ఇచ్చారు. కాగా డీఈఓ సోమశేఖర శర్మ పదోన్నతుల ప్రక్రియను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యాలయ ఏడీ వెంకటేశ్వరా చారి, సూపరింటెండెంట్లు చావా శ్రీనివాసరావు, శ్రీధర్, ఏపీఓ శ్రీనివాసరావు, ఏఎస్ఓ కిషోర్, జీఏస్ ప్రసాదరావు, దేవేందర్, నంద కిషోర్, యరమల్ల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, నగేష్, రామారావు, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ముగిసిన వాగ్గేయకారోత్సవాలు

- ఐదురోజులపాటు భక్తులను అలరించిన వేడుకలు
- రామయ్యకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఐదు రోజులుగా జరుగుతున్న 390వ భక్త రామదాసు జయంతి ఉత్సవాలు ఆదివారంతో విజయవంతంగా ముగిశాయి. శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం, చక్ర సిమెంట్స్ వారి నేంద్రగంటి అలివేలు మంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్ట్, నాదసుధా తరంగిణి కల్చరల్ ట్రస్ట్, నామగాన లహరి కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన వాగ్గేయకారోత్సవాలు భక్తులను, సంగీతాభిమానులను అలరించాయి. చివరి రోజైన ఆదివారం హైదరాబాద్‌కు చెందిన వంశీకృష్ణ, విద్య, మోహన కృష్ణ బృందం చేసిన శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు భక్తులను ఓలలాడించాయి. అనంతరం సంగీత కళాకారులను శాలువాలతో సత్కరించారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

ఘనంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన

దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

శ్రీకనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించా రు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. తలనీలాలు సమర్పించారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మురికి కూపం.. ఇప్పుడు మురిపెం !



పార్కులో ఏర్పాటు చేసిన ఫౌంటెన్

ఆహ్లాదపరిచే ఈ ఫౌంటెన్, స్కేటింగ్ రింక్, చెస్ బోర్డు ఎక్కడని ఆలోచిస్తున్నారా.. ఈ పార్కును చూడాలంటే ఏదో సుదూర పర్యాటక ప్రాంతానికి వెళ్లాల్సిన పనిలేదు. మన ఖమ్మంలోనే ఈ పార్కు రూపుదిద్దుకుంది. కొన్నేళ్ల క్రితం మురికి కూపంలా, దుర్వాసన వెదజల్లే గోళ్లపాడు చానల్‌ను ఆధునీకీకరించి.. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాక పైన పలువురు ప్రముఖుల పేర్లతో పార్కులు నిర్మించారు. ఇందులో ప్రొఫెసర్ జయశంకర్ పార్కులో పరిశీలిస్తే... ఫౌంటెన్, స్కేటింగ్ రింక్, బాస్కెట్‌బాల్ కోర్టు, చెస్ బోర్డు, పంచతత్వ పార్కులు ఇలా అన్నీ కొలువుదీరాయి. త్వరలోనే ఈ పార్కును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



చెస్ ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన బోర్డు



స్కేటింగ్ రింక్

చకచకా అడుగులు..

- మెడికల్ కళాశాల భవనాల ఆధునికీకరణకు ఏర్పాట్లు
- తొలి విడతలో రూ.8 కోట్లతో పనులు
- ఈ విద్యా సంవత్సరం నుంచే బోధనకు శ్రీకారం



పాత కలెక్టరేట్‌కు ఏర్పాటుచేసిన మెడికల్ కళాశాల బోర్డు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ఆస్పత్రికి అనుబంధంగా మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ప్రకటించింది. ఈ మేరకు రూ.168 కోట్లు వెచ్చిస్తూ జీవో కూడా జారీ చేసింది. మెడికల్ కళాశాలకు సంబంధించిన అదనపు నిర్మాణాల కోసం ఈనెల 5న ప్రభుత్వం రూ. 8.05 కోట్లు కేటాయించింది. ఇందుకు పరిపాలనా అనుమతులు ఇస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా మెడికల్ కళాశాల కోసం పనులు చకచకా సాగుతున్నాయి. ఇప్పటికే కళాశాలకు అనుబంధంగా ఉన్న జిల్లా ఆస్పత్రికి 24 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులను కేటాయించింది. వారు రోగులకు వైద్య సేవలు అందించడం కూడా మొదలు పెట్టి నాలుగు నెలలు దాటింది. తాజాగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను కూడా నియమించగా ఆయన విధుల్లో చేరారు. త్వరలో డీన్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బందిని కూడా కేటాయించనున్నారు. ఇక జిల్లా ఆసుపత్రితో పాటు మెడికల్ కళాశాలకు కేటాయించిన పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ భవనాలు కూడా ఖాళీ చేసి నూతన కలెక్టరేట్‌కు తరలిపోయాయి. ఇప్పుడు అధికారులు మెడికల్ కళాశాల కోసం పాత భవనాలను ఆధునికీకరించే పనిలో పడ్డారు. మూడు నెలల్లో ఈ పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు తయారు చేశారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచే ఇక్కడ బోధన ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.

30 ఎకరాలలో మెడికల్ కళాశాల..

గతేడాది మార్చిలో మెడికల్ కళాశాల మంజూరు చేయగా.. అధికారులు వెంటనే స్థల సేకరణ గావించారు. కళాశాల బోధన, ప్రాక్టికల్స్, హాస్టళ్ల తదితర అవసరాల కోసం సుమారు 25 ఎకరాలు అవసరమని అంచనా వేశారు. అయితే పెద్దాసుపత్రికి అనుబంధంగా స్థలం కావాల్సి రావడంతో ఆస్పత్రి ఎదుట ఉన్న కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ భవనాలను కేటాయించాలని నిర్ణయించారు. నూతన కలెక్టరేట్ పనులు జరుగుతుండగానే సర్వే చేపట్టి 30 ఎకరాలు అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. అందులో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణ 21.31 ఎకరాలు, కలెక్టరేట్ ఆవరణ 5.23 ఎకరాలు, ఆర్‌అండ్‌బీ ఆవరణ 3.09 ఎకరాలు అందుబాటులో ఉన్నట్లు తేల్చారు. కాగా కలెక్టరేట్ తరలి పోవడంతో పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ భవనాలను మెడికల్ కళాశాలకు కేటాయించారు. ఆధునికీకరణ పనులను టీఎస్‌ఎంఎస్ఐడీసీ ద్వారా ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పాత కలెక్టరేట్ భవనం నుండి జిల్లా ఆసుపత్రిని కలుపుతూ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టనున్నారు.

ఎన్‌ఎంసీ బృందం పరిశీలన పూర్తి..

ఎక్కడైనా మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలంటే నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి తప్పనిసరి. కాగా ఖమ్మానికి మెడికల్ కళాశాల మంజూరు కావటంతో ఎన్‌ఎంసీ సభ్యులు పరిశీలనకు వచ్చారు. ఈనెల 18న ప్రత్యేకబృందం ఆకస్మికంగా ఆసుపత్రి ని తనిఖీ చేసింది. అలాగే పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ భవనాలను కూడా పరిశీలించింది. మెడికల్ కళాశాలకు అనువైన పరిస్థితులున్నాయా? స్థలం, సిబ్బంది తదితర వివరాలు సేకరించి ఎన్‌ఎంసీకి నివేదిక అందజేసింది. అయితే ఇక్కడ కళాశాలకు కావాల్సిన అనువైన పరిస్థితులు ఉండడంతో బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలల తర్వాత మరో మారు బృందం పరిశీలనకు రానుంది. అప్పుడు ఎన్‌ఎంసీ నుండి పూర్తి స్థాయి అనుమతులు వచ్చే అవకాశం ఉంది. అయితే మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేసి జూన్ వరకు భవనాలు పూర్తి స్థాయిలో సిద్ధం చేయనున్నారు. పాత కలెక్టరేట్ భవనంలో కళాశాల బోధనకు, జిల్లా ఆసుపత్రిలో ప్రాక్టికల్స్, ఇతర విధులకు, అలాగే పాత డీఎంహెచ్ఓ భవనాన్ని పురుషులకు, ఆర్‌అండ్‌బీ భవనాన్ని విద్యార్థినుల హాస్టళ్లకు కేటాయించనున్నారు. క్రమక్రమంగా నిధులు విడుదలవుతున్న కొద్దీ కళాశాలను అభివృద్ధి చేసే అవకాశం ఉంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బోధన ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

క్లుప్తంగా

గిరిజన భవనం పరిశీలన



గిరిజన భవనం ఆవరణను పరిశీలిస్తున్న ఎస్టీడీడీ, ఏటీడీఓ

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో నిర్మించిన గిరిజన భవనాన్ని గిరిజన సంక్షేమశాఖ అభివృద్ధి అధికారి కృష్ణా నాయక్, ఏటీడీఓ నర్సింగ్ తిరుమల్‌రావు ఆదివారం సందర్శించారు. 'భవనం.. అలంకార ప్రాయమే' అను శీర్షికతో ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఐటీడీఏ పీఓ, జిల్లా కలెక్టర్ స్పందించారు. వారి ఆదేశాలతో అధికారులు భవనాన్ని సందర్శించి, పలు ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఇక నుంచి నిరంతరాయంగా ఉదయం ఒకరు, సాయంత్రం ఒకరు వాచ్‌మ్యాన్‌ను విధుల్లో ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. గిరిజన భవనం మెయింటెనెన్స్ కోసం ఓ ఉద్యోగిని ఏర్పాటు చేశారు. ఇక నుంచి రోజూ సదరు ఉద్యోగి గిరిజన భవనంలోనే ఉంటూ భవన నిర్వహణను చూస్తూ, ఫంక్షన్లకు, సమావేశాలకు అద్దెకు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీడ్రైవర్ మృతి



నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం



జాన్‌పాషా మృతదేహం

కల్లూరు: మండలంలోని రామకృష్ణాపురం గ్రామం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో లారీ డ్రైవర్ షేక్ జాన్‌పాషా (31) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం నుంచి (ఏపీ 31, టీఏ 6299) అనే నంబర్ గల లారీ ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా వినన్నపేటకు ధాన్యం లోడ్‌తో వెళ్తోంది. రామకృష్ణాపురం వద్దకు చేరుకున్నాక ఎదురుగా వెళ్తున్న మరో లారీ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో లారీ ముందు భాగం నుజ్జునుజ్జయి డ్రైవర్ షేక్ జాన్‌పాషా క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ హనూక్, ఎస్‌ఐ కొండల్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీశారు. డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖమ్మం–వైరా ప్రధాన రోడ్డులోని వెలుగుమట్ల పార్కు రోడ్డు సమీపంలో లారీ ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకోగా ఖమ్మం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. వెలుగుమట్ల వినోభానగర్‌కాలనీకి చెందిన బానోత్ బద్యా తన ద్విచక్రవాహనంపై శనివారం రాత్రి ఖమ్మం నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెలుగుమట్ల పార్కు రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన బద్యాను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి కోడలు విజయ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పేకాట, కోడి పందేల స్థావరాలపై దాడులు

తల్లాడ: మండలంలోని కొత్తవెంకటగిరి, వెంకట్రామునితండాల్లో ఆదివారం తల్లాడ పోలీసులు పేకాట, కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ సురేశ్ కథనం ప్రకారం.. కొత్తవెంకటగిరి గ్రామ శివారులోని జామాయిల్ తోటలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఏడు ద్విచక్ర వాహనాలు, రూ.7,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. వెంకట్రామునితండాలోని ఎన్‌ఎస్‌పీ కెనాల్ అడవి సమీపంలో కోడి పందేల స్థావరంపై దాడి చేశారు. ఆరుగురుని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.14,900 నగదు, 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో కానిస్టేబుళ్లు బాలాజీ, రామకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

కేసు నమోదు

కారేపల్లి: ఒక వ్యక్తిని నిర్బంధించి దాడి చేసిన వ్యక్తులపై ఆదివారం రాత్రి కేసు నమోదైంది. ఎస్‌ఐ రామారావు కథనం మేరకు.. బోటితండా గ్రామానికి చెందిన భూక్య వీరేందర్ చీమలపాడు గ్రామంలో కూలి పనుల నిమిత్తం వెళ్లాడు. అయితే, కుటుంబ కలహాల నేపథ్యంలో వీరేందర్ భార్య.. చీమలపాడుకు చెందిన దివ్య, అత్త బుల్లితోపాటు మాలోత్ రాంకోటి, పంతులు, ప్రకాష్.. వీరేందర్‌ను చీమలపాడులో బంధించి దాడి చేశారు. దీంతో అదే రాత్రి ఇంటికి వచ్చిన వీరేందర్ మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. వీరేందర్ తల్లి భూక్య హాస్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారేపల్లి ఎస్‌ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహం.. ఉద్వేగం..

- రసవత్తరంగా సాగుతున్న ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీ
- సెమీస్‌కు చేరిన శ్రీ చైతన్య జూనియర్ కళాశాల
- క్వార్టర్స్‌లో ప్రవేశించిన ఎస్‌బీఐటీ, అనుబోస్ డిప్లొమా జట్లు



రేవంత్ (రెజొనెన్స్)



గౌతమ్ (శ్రీచైతన్య)



సెమీస్‌కు చేరిన శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీ జీఎన్ఆర్ కళాశాల మైదానంలో జరుగుతున్న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా.. ఉద్వేగంగా సాగుతున్నాయి. ఆదివారం రెండోరోజు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల – వెలాసిటీ జూనియర్ కళాశాల జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్టు 74 పరుగులు చేయగా, తర్వాత బ్యాటింగ్ చేసిన వెలాసిటీ జూనియర్ కళాశాల జట్టు 52 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. దీంతో శ్రీచైతన్య జూనియర్ కళాశాల జట్టు 22 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా ఇప్పటికే రెండు మ్యాచ్‌లు గెలిచిన ఎస్‌బీఐటీ డిప్లొమా కాలేజీ జట్టు తన ప్రత్యర్థి ఏఎస్‌ఆర్ జూనియర్ కళాశాలపై నెగ్గి క్వార్టర్ ఫైనల్స్‌కు ప్రవేశించింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన ఏఎస్‌ఆర్ జట్టు పరిమిత ఓవర్లకు 63 పరుగులు సాధించగా బ్యాట్స్‌మెన్ ముస్తఫా 19 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్‌బీఐటీ జట్టు సునాయాసంగా లక్ష్యం సాధించింది. దీంతో ఎస్‌బీఐటీ డిప్లొమా కాలేజీ జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. కిట్స్ డిప్లొమా కాలేజీ ఖమ్మం – అనుబోస్ డిప్లొమా కళాశాల పాల్వంచ జట్ల మ్యాచ్‌లో.. ముందుగా టాస్ గెలిచిన అనుబోస్ డిప్లొమా జట్టు ఫీల్డింగ్‌ను ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన కిట్స్ జట్టు 78 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనుబోస్ జట్టు 40 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. దీంతో కిట్స్ డిప్లొమా కళాశాల జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది.

మొదటి రౌండ్‌లో బొమ్మ కాలేజీ విజయభేరి..

బొమ్మ డిప్లొమా కాలేజీ – వాణి ఐటీఐ ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వాణి ఐటీఐ జట్టు పరిమిత ఓవర్లలో 71 పరుగులు చేయగా, తర్వాత బ్యాటింగ్

చేసిన బొమ్మ డిప్లొమా కాలేజీ జట్టు 72 పరుగులు సాధించింది. రెండో మ్యాచ్‌లో ఆర్‌జేసీ జూనియర్ కళాశాల – ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కొత్తగూడెం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఆర్‌జేసీ జట్టు కేవలం 44 పరుగులు చేయగా.. తర్వాత బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కొత్తగూడెం జట్టు ఘన విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కృష్ణవేణి జూనియర్ కళాశాల 2– వెలాసిటీ జూనియర్ కళాశాల ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కృష్ణవేణి జట్టు 53 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన వెలాసిటీ జూనియర్ కళాశాల జట్టు నాలుగు వికెట్ల నష్టంతోనే లక్ష్యం సాధించింది. మూడో మ్యాచ్‌లో రెజొనెన్స్ జూనియర్ కళాశాల (మెయిన్ క్యాంపస్) – ముదిగొండ జూనియర్ కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రెజొనెన్స్ జూనియర్ కళాశాల (మెయిన్ క్యాంపస్) నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 64 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ముదిగొండ జూనియర్ కళాశాల జట్టు పరిమిత ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసి ఓటమి పాలైంది. దీంతో రెజొనెన్స్ జూనియర్ కళాశాల జట్టు ఘన విజయం సాధించింది. జట్టు కెప్టెన్ రేవంత్ చక్కని ప్రతిభ కనబరిచాడు.



విజేతగా నిలిచిన రెజొనెన్స్ కళాశాల జట్టు

'గిరిజన బంధు' ప్రకటించాలి



అభివాదం చేస్తున్న నాయకులు

కారేపల్లి: సీఎం కేసీఆర్ అమలు చేస్తానన్న 'గిరిజనబంధు'ను వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరాంనాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం కారేపల్లి వైఎస్ఎన్ గార్డెన్స్‌లో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉసిరికాయలపల్లి సర్పంచ్ బాణోతు బన్సీలాల్ అధ్యక్షతన ఆహ్వాన సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాస్తూ దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. విభజన చట్టంలో భాగంగా ఏర్పాటు చేస్తానన్న గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమలను ఏర్పాటు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో గిరిజనులు పోరాడి సాధించుకున్న గిరిజన రిజర్వేషన్ జీఓ 33ను కేంద్ర ప్రభుత్వం చట్టబద్రత కల్పించి, 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూక్యా వీరభద్రం, బాణోతు బాలాజీనాయక్, జిల్లా నాయకులు మూడ్ గన్యా నాయక్, తేజావత్ కృష్ణకాంత్, అజ్మీర శోభన్‌నాయక్, భూక్యా లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అఖండ మహాకరుణ శాకాహార ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: మాంసాహారం వద్దు.. శాకాహారం ముద్దు.. అనే నినాదంతో ఖమ్మం నగరంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఇండియా (పీయంసీ) ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలో మహా కరుణ శాకాహార ర్యాలీని నిర్వహించారు. బ్రహ్మర్షి పితామహ పత్రీజీ గురువు మార్గదర్శకత్వంలో మూగజీవుల పరిరక్షణ కోరుతూ ధ్యానులు ప్లకార్డులతో ఈ ర్యాలీని నిర్వహించారు. తొలుత మమత వైద్యశాల రోడ్‌లో ఏర్పాటు చేసిన నూతన పిరమిడ్‌ను నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, పిరమిడ్ నిర్వాహకులు కాటేపల్లి శైలజ ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ఈఆర్‌ఆర్ గార్డెన్స్, బోనకల్ రోడ్, చర్చి కాంపౌండ్ తదితర ప్రధాన రహదారుల గుండా సాగింది. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు కాటేపల్లి శైలజ మాట్లాడుతూ.. మానవజాతి మనుగడ సాగాలంటే శాఖాహారం భుజించాలని, శాకాహారంలో అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. జంతు హింస మహా పాపమని, వాడవాడలా పిరమిడ్‌లు ఏర్పాటు చేసి శాకాహారాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ర్యాలీలో మహిళలు, పురుషులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో వివిధ వేషధారణలతో పాల్గొన్నారు. కోలాటాలతో అలరించారు. కొందరు మహిళలు ప్రత్యేక ఏకరూప దుస్తుల్లో పాల్గొని శాఖాహారంపై నినదించారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్‌కు చెందిన మరం ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, మన్నెం కృష్ణ, పగడాల నాగరాజు, కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత, ఆనంద్, ప్రసాద్, సీతయ్య, పుల్లఖండం వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి, రాజర్షి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మందిరాలకు మాజీ ఎంపీ పొంగులేటి విరాళాలు



విరాళాలు అందజేస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: కొణిజర్ల మండలంలోని చిన్నమునగాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి రూ.15 వేలను విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో స్థానిక గ్రామ సర్పంచ్ కాంపల్లి స్వప్న చేతుల మీదుగా కమిటీ సభ్యులకు అందించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలోని పలు మండలాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాలు, మసీదులు, చర్చిల నిర్మాణానికి ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విరాళాలు అందజేశారు. ఈ మొత్తాన్ని అశ్వారావుపేట నియోజకవర్గ నాయకులు జారె ఆదినారాయణ చేతుల మీదుగా పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. దమ్మపేట మసీదుకు రూ.30 వేలు, అంకంపాలెం గ్రామంలోని ముత్యాలమ్మ గుడికి రూ.25 వేలు, అర్లపెంట గ్రామంలోని రామాలయానికి రూ.25 వేలు, కొడిసెగట్టు గ్రామంలోని చర్చి నిర్మాణానికి రూ.20 వేలు, ఒడ్డుగూడెం గ్రామంలోని రామాలయానికి రూ.20 వేలను విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గోసు మధు, సర్పంచ్ పరికపల్లి శ్రీను, కన్నెగంటి రావు, గడల నరేందర్‌నాయుడు, పాపగంటి జనార్దన్, కాంపల్లి చుక్కయ్య, పాపగంటి బెంజి, చిన్నబాబు, కత్తి ప్రభాకర్, పాపగంటి సురేశ్, పాపగంటి అబ్బులు, ఊటుకూరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కథల విజేతలకు బహుమతులు ప్రదానం



సుమలతకు అక్షరాల తోవ పురస్కారం అందిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: అక్షరాల తోవ సాహితీ సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీల్లో విజేతలకు ప్రముఖ కవులు, రచయితల చేతుల మీదుగా పురస్కారాలు అందజేశా రు. అక్షరాల తోవ ఐదో వార్షికోత్సవం ఆదివారం ఖమ్మంలోని రిక్కాబజార్ హైస్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా జాతీయస్థాయిలో నిర్వహించిన కథల పోటీల్లో విజేతలుగా నిలిచిన విజయవాడకు చెందిన సుమలత, ఖమ్మానికి చెందిన విద్యాసాగర్‌కు అక్షరాల తోవ పురస్కారం–2023 అందించారు. అనంతరం 2022, 2023 సంవత్సరాల్లో పురస్కారాలు పొందిన వారి కథలతో రూపొందించిన పుస్తకాన్ని ప్రముఖ కవులు, విద్యావేత్తలు మువ్వా శ్రీనివాసరావు, రవిమారుత్, ప్రముఖ విమర్శకులు వంశీకృష్ణ, ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు అట్లూరి వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచమళ్ల ఉపేందర్ అధ్యక్షతన జరిగిన సభలో మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సమాజాన్ని చదివిన వారు సాహితీవేత్తలుగా రాణిస్తారని, మంచి కథకులుగా ఎదుగుతారని తెలిపారు. వంశీకృష్ణ మాట్లాడుతూ.. ప్రతి కథకు ఆత్మ ఉండాలన్నారు. అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ.. ఖమ్మం మట్టిలోనే సాహిత్య పరిమళం ఉందన్నారు. రచయిత్రి సునంద మాట్లాడుతూ.. ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి సాహిత్య సేవ చేయటం అభినందనీయమని తెలిపారు. అనంతరం కవితల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని, బాల సాహిత్యంలో సేవలందిస్తున్న వారిని సత్కరించారు. కార్యక్రమంలో నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రౌతు రవి, కన్నెగంటి వెంకటయ్య, సయ్యద్ షఫీ, పొత్తూరి సీతారామారావు, బ్రహ్మం, బాబు, రాములు, కృష్ణయ్య, దేవేంద్ర, ఝాన్సీ, సుభాషిణి, రాధ, మాధవి, హవీల, జగీష్ పాల్గొన్నారు.

● ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఆనాటి విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌కు చెందిన 1987–88వ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రావెల్ టిప్పర్ పట్టివేత

కల్లూరు/ కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని బత్తులపల్లి గ్రామం నుంచి అక్రమంగా గ్రావెల్‌ను రవాణా చేస్తున్న టిప్పర్‌ను ఆదివారం రాత్రి రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. బత్తులపల్లిలో రైతుకు చెందిన భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వుతున్న అంశంపై రెవెన్యూ అధికారులు నిఘా పెట్టారు. తహసీల్దార్ బాబ్జిప్రసాద్ ఆదేశాల మేరకు వీఆర్‌ఏలు మాటు వేసి గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని కల్లూరు పోలీసులకు అప్పగించారు.

అక్రమ 'కోట' కదులుతోంది

- రియల్ ఎస్టేట్ వెంచర్ ఫెన్సింగ్ తొలగింపు
- ప్రహరీ, ఇళ్ల నిర్మాణాలకు అప్రూవల్ లేదు
- దిద్దుబాటు చర్యల్లో రెవెన్యూ యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..



ఫెన్సింగ్ స్తంభాలు తొలగిస్తున్న దృశ్యం

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం గంగారంలో బేతుపల్లి రెవెన్యూలోని అక్రమాల వ్యవహారం కలెక్టర్ వీపీ గౌతమ్ దృష్టికి వెళ్లిందనే సమాచారంతో అక్రమార్కులు సరికొత్త ఆలోచనతో ముందుకెళ్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్‌కు అనుమతులు లేవని పదేపదే గంగారం గ్రామపంచాయతీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, ఫెన్సింగ్ ఉంటే కలెక్టర్ చర్యలు తీసుకుంటారనే ఉద్దేశంతో స్వయంగా అక్రమార్కుడే ఆదివారం ఫెన్సింగ్ తొలగించడం విశేషం. 'సాక్షి'లో వస్తున్న వరుస కథనాలు ఓ వైపు అధికారులు.. మరో వైపు ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశం కావడం, అక్రమార్కుడి చిట్టాను బయట పెట్టాలని విజ్ఞప్తులు వెల్లువెత్తడంతో సరికొత్త నాటకానికి తెరలేపారు. అక్రమ 'కోట' ఆగడాలపై ఇంటెలిజెన్స్ పోలీసులు ఆరాతీసి నివేదిక పంపించినట్టు ప్రచారం జరుగుతోంది. నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే ఉపేక్షించేది లేదని ఎంపీడీఓ సీహెచ్ సుభాషిణి స్పష్టం చేయడం, అవసరమైతే తమ సిబ్బందితోనే తొలగిస్తామని చెప్పడంతో ఫెన్సింగ్ తీసేశాడని కొందరు అంటుండగా, కొన్నిరోజుల తర్వాత మళ్లీ ప్లాట్లుగా విభజించి అమ్ముకోవచ్చనే ఉద్దేశంతోనే ప్రస్తుతానికి ఫెన్సింగ్ తొలగించాడని మరి కొందరు అంటున్నారు.

కట్టడాలకు అప్రూవల్ లేదు..

అక్రమార్కుడి సామ్రాజ్యం గంగారం నుంచి మేడిశెట్టివారిపాలెం వరకు సుమారు రెండు కిలోమీటర్లు విస్తరించాడు. సమయమంతుల కుటుంబాలకు చెందిన భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లతో పలుచోట్ల ప్రహరీలు నిర్మించడంతోపాటు బోర్లు వేసి వాటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. రామగోవిందాపురం పంచాయతీలోని మేడిశెట్టివారిపాలెం సమీపంలో 998 స్క్వేర్ మీటర్లలో బహుళ అంతస్తుల భవంతి నిర్మాణాన్ని మూడు నెలల క్రితం చేపట్టాడు. దీనికి అనుమతి తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి నిరోష పలుమార్లు అక్కడికి వెళ్లి కోరినా ఫలితం లేదు. మీసేవ ద్వారా ఆన్‌లైన్‌లో డీటీసీపీఓకు దరఖాస్తు చేసుకున్నారని.. పీఆర్ డిపార్ట్‌మెంట్ వద్దకు వెళ్లినట్టు ప్రస్తుత స్టేటస్ ఉందని, ఇంకా అప్రూవల్ రాలేదని పంచాయతీ కార్యదర్శి స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ఇళ్లు, వెంచర్లకు ప్రహరీలు నిర్మించడం నేరమని, దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించామని ఎంపీఈఓ కృష్ణయ్య తెలిపారు.

కలెక్టర్ పరిశీలిస్తేనే..

బేతుపల్లి రెవెన్యూలోని అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో కలెక్టర్ పరిశీలనకు వస్తేనే నిజానిజాలు బయటకు వస్తాయని, అప్పుడే అక్రమార్కుడి ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని బాధితులు అంటున్నారు. అసలు కాస్రా పహణీ ప్రకారం సర్వే నంబర్ 133లో భూమి ఎంత ఉంది. ఏ భూమిలో ఎవరెవరు ఉన్నారో బయటకు వస్తుందని, కలెక్టర్ రాక కోసం ఎదురు చూస్తున్నారు.

క్లుప్తంగా...

నేడు, రేపు ఏపీ సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటన

- 'ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'లో పాల్గొననున్న ఏపీ ముఖ్యమంత్రి



సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 30, 31 తేదీల్లో ఢిల్లీలో పర్యటించనున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 6.45 గంటలకు ఢిల్లీ చేరుకుని 1 జన్‌పథ్ నివాసంలో రాత్రికి బసచేస్తారు. మంగళవారం ఉదయం 10.30 నుంచి 5.30 గంటల వరకు ఢిల్లీ లీలా ప్యాలెస్ హోటల్లో దౌత్యవేత్తలతో జరగనున్న ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రౌండ్ టేబుల్ సమావేశం-కర్టెన్‌రైజర్ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం 6.05 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 8.50 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

తీరంలో అలజడి

- నేడు వాయుగుండంగా మారనున్న తీవ్ర అల్పపీడనం



సాక్షి, విశాఖపట్నం/వాకాడు (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా వాకాడు తీరంలో భీకర శబ్దాలతో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతం, తూర్పు భూమధ్యరేఖ ప్రాంతం మీదుగా ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం మధ్య ట్రోపోస్ఫిరిక్ స్థాయి వరకు విస్తరించి ఉంది. తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. అనంతరం నైరుతి బంగాళాఖాతం మీదుగా నెమ్మదిగా పయనిస్తూ ఫిబ్రవరి 1 నాటికి శ్రీలంక తీరానికి చేరుకుంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి నివేదికలో తెలిపింది. దీని ప్రభావంతో సోమవారం నుంచి మూడు రోజుల పాటు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించింది. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో ఆదివారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్ర తీరంలో ఈదురు గాలులు వీస్తుండగా.. సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. దీంతో సముద్రం దాదాపు 5 మీటర్ల వరకు ముందుకు చొచ్చుకొచ్చి తీరాన్ని తాకుతోంది.

'గల్ఫ్' వలసలపై ఆరా!

బడ్జెట్‌కు ముందు సర్కారు కసరత్తు • వివరాలు సేకరిస్తున్న ఇంటెలిజెన్స్ విభాగం



మోర్తాడ్ (బాల్కొండ): గల్ఫ్ దేశాలకు కార్మికుల వలసలపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం వివరాలు సేకరిస్తోంది. 2018 నుంచి ఇప్పటివరకు ఏ సంవత్సరం ఎంతమంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారనే వివరాలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించనున్న తరుణంలో ఈ ప్రక్రియ చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి అధికంగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోని కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో, పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల గెలుపు ఓటములపై గల్ఫ్ వలసలు ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. వలస కార్మికుల సంక్షేమానికి ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేసింది. ఆయన మరణం తర్వాత గల్ఫ్ వలస కార్మికుల గురించి పట్టించుకున్నవారు లేరని విమర్శలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం సమయంలోనూ గల్ఫ్ వలస కార్మికుల అంశం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. ఉద్యమంలో కార్మికుల కుటుంబాలు చురుగ్గా పాల్గొన్నాయి. అయితే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా గల్ఫ్ వలస కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కేరళ తరహాలో ప్రవాసీ విధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేయాలని లేదా గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మొదటి నుంచీ వినిపిస్తోంది. కాగా 2019 అక్టోబర్‌లో కూడా పంచాయతీ రాజ్ శాఖ ఇదే అంశంపై వివరాలను నమోదు చేసింది. కానీ అప్పట్లో ఆ ప్రక్రియ అర్ధాంతరంగా ఆగిపోయింది. త్వరలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న తరుణంలో మరో సారి వలస కార్మికుల లెక్కల విషయంలో సర్కారు దృష్టి సారించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం వలస కార్మికుల వివరాలు సేకరిస్తున్న విషయం తమ దృష్టికి కూడా వచ్చిందని గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు మంద భీంరెడ్డి తెలిపారు. ప్రభుత్వం వద్ద కచ్చితమైన లెక్కలు ఉంటే వలస కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఉమ్మడి జిల్లాల వారీగా వలస కార్మికుల వివరాలు..
(వలస కార్మికుల సంఘాల అంచనాల ప్రకారం)

జిల్లా పేరు	వలస కార్మికుల సంఖ్య
హైదరాబాద్	4,50,000
కరీంనగర్	3,10,000
నిజామాబాద్	2,90,000
ఆదిలాబాద్	1,85,000
మెదక్	1,00,000
వరంగల్	80,000
మహబూబ్‌నగర్	30,000
నల్లగొండ	25,000
ఖమ్మం	20,000
రంగారెడ్డి	20,000
మొత్తం	15,10,000





చెర్వుగట్టు ఆలయం వద్ద భక్తజన సందోహం. (ఇన్‌సెట్లో) కల్యాణతంతు జరిపిస్తున్న అర్చకులు →

కమనీయం.. రామలింగేశ్వరుడి కల్యాణం

- చెర్వుగట్టులో భక్తజన సందోహం

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ప్రధాన ఆలయం నుంచి స్వామి అమ్మవారిని నంది వాహనంపై మంగళవాయిద్యాలు, భజనల మధ్య కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. వేద పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్యశాస్త్రి, నీలకంఠశివాచార్య, ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సురేశ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ తంతు జరిపించారు. స్వామి వారికి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి నూతన పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి దాదాపు లక్ష మంది భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.

వట్టి వసంతకుమార్ కన్నుమూత



భీమడోలు/ఆరిలోవ/ ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వట్టి వసంతకుమార్ (70) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆయన 4 రోజుల క్రితం విశాఖపట్నంలోని అపోలో ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు పిల్లలు లేరు. భార్య ఉమాదేవి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, పీహెచ్‌డీ చేసిన వట్టి వసంతకుమార్ అదే విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అనుచరుడు, సహచరుడిగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక భూమిక పోషించారు. 2004, 2009 ఎన్నికల్లో ఉంగుటూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రిగా పనిచేశారు. వైఎస్సార్ మృతి తర్వాత పరిణామాలకు కలతచెందిన ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. కాగా వట్టి వసంతకుమార్ మృతి పట్ల ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

'రాజకీయ స్వార్థం కోసమే బీఆర్ఎస్'



సాక్షి, హైదరాబాద్: రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ పార్టీ పని చేస్తుంది తప్ప.. ప్రజా ప్రయోజనాల కోసం కాదని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆదివారం వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు టీడీపీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ చెప్పేదొకటి.. చేసేది ఒకటిగా ఉందని విమర్శించారు.

తెలంగాణ తరహా పాలన కావాలంటున్నారు

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
- మహారాష్ట్రలోని నాందేడ్‌లో బీఆర్ఎస్ సభ ఏర్పాట్ల పరిశీలన



నాందేడ్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

బోధన్/నిర్మల్: మహారాష్ట్ర ప్రజలు తెలంగాణ తరహా సంక్షేమ పాలన కావాలని కోరుతున్నారని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 5న నిర్వహించే బీఆర్ఎస్ సభాస్థలిని ఆదివారం ఆయన పరిశీలించారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాల మల్లు, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఆయన వెంట ఉన్నారు. సభాస్థలంలో వేదిక, పార్కింగ్ ప్రదేశాలు, బారికేడ్ల ఏర్పాటు పనుల ప్రగతిని మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ ప్రముఖులు బీఆర్ఎస్‌తో కలసి పనిచేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. నాందేడ్ సభలో సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు జాతీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది బీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. నాందేడ్ సభలో కేసీఆర్ సమక్షంలో మహారాష్ట్రకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరనున్నారని మంత్రి చెప్పారు. కాగా, నాందేడ్ జిల్లా కేంద్రంలోని గురుద్వారాను ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్నలతో పాటు బీబీ పాటిల్, బాల్క సుమన్, మహ్మద్ షకీల్, రవీందర్ సింగ్ దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

జిల్లా వార్తలు

వరల్డ్‌కప్‌లో 'భద్రాద్రి తేజం'

- ఫైనల్‌లో కీలక పాత్ర పోషించిన త్రిష
- భద్రాచలంలో క్రీడాకారుల సంబరాలు



గొంగడి త్రిష

భద్రాచలం: అండర్ - 19 వరల్డ్ కప్‌లో తెలంగాణ తేజం, భద్రాచలానికి చెందిన గొంగడి త్రిష అద్భుత ప్రతిభ కనబర్చింది. బౌలింగ్‌లో, బ్యాటింగ్‌లో రాణించి వరల్డ్‌కప్ సాధనలో తనవంతు పాత్ర పోషించింది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ఇంగ్లండ్‌పై భారత జట్టు విజయభేరి మోగించి కప్ సొంతం చేసుకుంది. 68 పరుగులకే ఇంగ్లాడ్ జట్టును ఆలౌట్ చేసిన భారత్.. అనంతరం బ్యాటింగ్ చేపట్టగా త్రిష అద్భుత ఆటతీరును ప్రదర్శించింది. 24 పరుగుల వ్యక్తిగత స్కోర్‌ను సాధించి సౌమ్య తివారితో కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేసి అండర్-19 వరల్డ్ కప్‌ను దేశానికి అందించింది. ఉమెన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన ఇంగ్లండ్ కెప్టెన్‌ను క్యాచ్ ద్వారా ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపుతిప్పింది. దీంతో త్రిష సొంతూరైన భద్రాచలంలో క్రీడాభిమానుల ఆనందానికి హద్దే లేదు. మ్యాచ్ ఆద్యంతం టీవీల్లో వీక్షించారు. గెలిచిన అనంతరం రోడ్లపైకి వచ్చి సంబరాలు జరిపారు. బాణాసంచా కాల్చుతూ జయహో భారత్ నినాదాలు చేశారు.

తొలి వరల్డ్‌కప్ టోర్నీలో 'మెరిసిన త్రిష'

భద్రాచలంలో జిమ్ నిర్వహించే గొంగడి రామిరెడ్డి కుమార్తె అయిన త్రిషను చిన్నతనం నుంచే క్రికెట్‌లో తీర్చిదిద్దారు. ఎనిమిదేళ్ల వయసులోనే జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించి ఉమెన్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచింది. స్థానిక కళాశాల క్రీడా మైదానంలో త్రిషకు ఓనమాలు నేర్పిన రామిరెడ్డి, తన కూతురును అంతర్జాతీయ క్రీడాకారిణిగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్‌కు కుటుంబాన్ని తరలించి, త్రిషను ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దారు. ఇటీవల అండర్-19 జట్టు తరఫున శ్రీలంక, వెస్టిండీస్, న్యూజిలాండ్ సిరీస్‌లలో రాణించటంతో అండర్-19 వరల్డ్ కప్ జట్టుకు త్రిషను ఎంపిక చేశారు. అండర్-19 వరల్డ్ కప్‌లో తొలిసారిగా ఎంపికవడంతో పాటు తొలి మ్యాచ్‌లోనే అద్భుతంగా ఆడి వరల్డ్‌కప్ సాధనకు దోహదం చేయడం విశేషం. స్కాట్‌లాండ్‌తో ఆడిన ఆటలో 51 బంతుల్లో 57 పరుగులు సాధించింది. భవిష్యత్‌లో మరింతగా రాణించాలని, త్రిషకు 'భద్రాద్రి రామయ్య' ఆశీస్సులు ఉండాలని ఈ ప్రాంత ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



ఆనందోత్సాహాల్లో క్రీడాభిమానులు

ప్రభుత్వ డెయిరీలో ప్రక్షాళన..

- అంతర్గత కుమ్ములాటలతో అధోగతి
- డీడీ, మరో నలుగురిపై కొరడా
- పాల సొసైటీల బలోపేతానికి చర్యలు



ఖమ్మం పాడి పరిశ్రమ యూనిట్

ఖమ్మంవ్యవసాయం: అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డెయిరీ) ప్రక్షాళనకు సంస్థ యాజమాన్యం నడుం బిగించింది. డెయిరీలో కొంతకాలంగా వెన్న, పాలు, పాల పదార్థాలు పక్కదారి పట్టిన వ్యవహారంపై రాష్ట్ర స్థాయి అధికారులు విచారణ జరుపుతూనే ఉన్నారు. ఓ ప్రత్యేకాధికారిని నియమించి ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్నారు. ఈ క్రమంలో ఖమ్మం డెయిరీలో రూ.40 లక్షల మేర అక్రమాలు జరిగినట్లు గుర్తించి, బాధ్యులైన ఐదుగురిపై తాజాగా వేటు వేశారు. ప్రస్తుత డీడీ సత్యనారాయణను మాతృసంస్థ అయిన పశుసంవర్ధక శాఖకు పంపించడంతో పాటు, మరో నలుగురిని సస్పెండ్ చేశారు. డీడీ స్థానంలో వరంగల్ పశుసంవర్ధక శాఖ ఏడీ కుమారస్వామిని నియమించారు. రాష్ట్ర పాడి పరిశ్రమ సమాఖ్య ఎండీ ఆదేశాల మేరకు జనరల్ మేనేజర్ మల్లయ్య శని, ఆదివారాల్లో ఖమ్మంలోనే మకాం వేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న వనరుల ఆధారంగా దాదాపు 50 వేల లీటర్ల సామర్థ్యం గల పాడి పరిశ్రమను ఖమ్మంలో ఏర్పాటు చేశారు. ఆరంభంలో ఈ పరిశ్రమకు మంచి ఆదరణ లభించినా.. ప్రైవేటు డెయిరీల రంగ ప్రవేశం, సంస్థ నిర్వహణ గాడి తప్పడంతో రైతుల నుంచి ఆదరణ కోల్పోతోంది. ఈ పరిశ్రమ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 10 బల్క్‌మిల్క్ సెంటర్లు, 200 పైగా పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. పరిశ్రమ రెండు జిల్లాల్లో విస్తరించినప్పటికీ నిర్వహణ లోపాలతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. సాధారణంగా పాల సీజన్ అయిన అక్టోబర్ - మార్చి మధ్య నిత్యం 25వేల లీటర్ల పాలను సేకరించే సంస్థ.. కొన్నేళ్లుగా రోజుకు 14 నుంచి 18 వేల లీటర్లకు మించి సేకరించడం లేదు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు రోజుకు 18 వేల లీటర్ల చొప్పున సేకరించగా, జనవరిలో 14 వేల లీటర్లకు పడిపోయింది. ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు ఇస్తున్నా ఆశించిన స్థాయిలో రైతులు ఆదరించడం లేదు. సంస్థ నిర్వహణ లోపాలు, అవినీతి, అధికారులు, ఉద్యోగులు, సహకార సంఘాలు, రైతుల మధ్య అంతర్గత విభేదాలు తదితర కారణాలతో డెయిరీ అప్రతిష్ఠ పాలవుతోంది.

వెల్లువెత్తిన ఫిర్యాదులు..

ఖమ్మం డెయిరీలో రెండేళ్లుగా అంతర్గత కుమ్ములాటలు పెరిగాయి. ఉన్నతాధికారుల మధ్య సమన్వయం లేకపోవటం, కొందరు అధికారులు పాల పదార్థాల రవాణాలో అక్రమాలకు పాల్పడడం, అవినీతి పెచ్చరిల్లడంతో పరిశ్రమ నిర్వహణ పక్కదారి పట్టింది. అక్రమాలకు అడ్డొచ్చిన కిందిస్థాయి ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీలు చేయడంతో ఈ కుమ్ములాటలు మరింతగా పెరిగాయి. రూ.లక్షల విలువైన పాల పదార్థాలు పక్కదారి పట్టడంపై రాష్ట్ర ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. పాడి పశువుల కొనుగోళ్లలో అన్యాయం జరిగిందని, బీమా సక్రమంగా చెల్లించక నష్టపోయామని కొందరు రైతులు ఆందోళనలు కూడా చేశారు. ఈ క్రమంలో ఏడాది క్రితం కొందరిని ఇక్కడి నుంచి బదిలీ చేసి, డీడీగా సత్యనారాయణను నియమించారు. అయినా పరిస్థితి మారకపోవడంతో మరోసారి చర్యలకు రాష్ట్ర సంస్థ పూనుకుంది.

డీడీతో పాటు నలుగురిపై వేటు..

డెయిరీలో అవినీతి, అక్రమాలపై రాష్ట్ర సంస్థ విచారణ చేపట్టి బాధ్యులైన ఐదుగురిపై వేటు వేసింది. డీడీ సత్యనారాయణను పశుసంవర్ధక శాఖ(నల్గొండ)కు పంపించారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేసి పలు ఆరోపణలపై నల్లగొండకు బదిలీ అయిన నరేష్, ప్రస్తుత మేనేజర్ భరతలక్ష్మితో పాటు ప్లాంట్ ఆపరేటర్ మణి, ల్యాబ్ అసిస్టెంట్ నాగశ్రీని సస్పెండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎండీ జనరల్ మేనేజర్ మల్లయ్య ద్వారా ఆయా అధికారులు, ఉద్యోగులకు ఉత్తర్వులు అందజేయించారు. కాగా, మిగిలిన ఉద్యోగులతో అధికారులు ఆదివారం సమావేశం నిర్వహించి పరిశ్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

నూతన యంత్రాంగం నియామకానికి చర్యలు..

ఖమ్మం పాడి పరిశ్రమలో అవినీతి అక్రమాలను అధిగమించేందుకు నూతన యంత్రాంగాన్ని నియమించేలా ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. పాల సేకరణ పెంచడంతో పాటు అవినీతి అక్రమాలకు చెక్ పెట్టేలా తగిన కార్యాచరణ రూపొందించాలని సంస్థ నిర్ణయించింది. ఇక పాల సొసైటీల బలోపేతానికి సైతం చర్యలు చేపట్టాలనే యోచనలో సంస్థ యాజమాన్యం ఉంది.

నాణ్యతా ప్రమాణాలు మెరుగుపర్చుతాం

ఖమ్మం పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర సంస్థ తగిన చర్యలు తీసుకుంటుంది. డెయిరీ నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు అనేవి సంస్థ అంతర్గత అంశాలు. నిర్వహణలో తలెత్తిన సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఖమ్మం పరిశ్రమలో నిర్వహణ, ఇతర అంశాల్లో నాణ్యతను పెంచేందుకు కృషి చేస్తున్నాం. సంస్థ నిర్వహణకు అవసరమైన సాంకేతిక అధికారులను నియమిస్తున్నాం. అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకుంటాం. -మల్లయ్య, జీఎం

కోలాహలంగా జాతీయస్థాయి కరాటే పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు (ఇన్‌సెట్) పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని వర్తక సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే అండ్ కుంగ్‌ఫూ పోటీలతో సర్వత్రా సందడిగా మారింది. హోంగార్డు ఆర్ఐ శ్రీశైలం, ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్‌రావు, టోర్నీ చీఫ్ ఆర్గనైజర్ గోపతి సైదులు పోటీలను ప్రారంభించగా, వివిధ ప్రాంతాల నుంచి 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఖమ్మం త్రీటౌన్ సీఐ పంజాల సర్వయ్య, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు సోమ నర్సింహారావు(జీవై నరేష్) పాల్గొన్నారు. గ్రాండ్ చాంపియన్‌గా నిలిచిన వారికి ప్రత్యేక ట్రోఫీలు అందజేశారు.

నేడు సింగరేణి డైరెక్టర్ల ఎంపిక

- ప్రధానంగా పోటీలో ముగ్గురు జీఎంలు
- హైదరాబాద్ సింగరేణిభవన్‌లో నేడు ఇంటర్వ్యూలు



హైదరాబాద్‌లోని సింగరేణి భవన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి డైరెక్టర్ పోస్టుల నియామకం నేటితో తేలిపోనుంది. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులను ఎంపిక చేయనున్నారు. జీఎంస్థాయి విధుల్లో వారి నైపుణ్యం, అంకితభావం, సంస్థ అభివృద్ధికి వారి చేసిన కృషి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్ ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్నారు. ఇప్పటివరకు ఆయన ఆపరేషన్స్‌తోపాటు ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్, పర్సనల్ వెల్ఫేర్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నేడు జరిగే ఇంటర్వ్యూలో సంస్థలోని సీనియర్, సమర్థవంతమైన జీఎంలను ఆపరేషన్స్, ప్రాజెక్ట్ డైరెక్టర్లుగా ఎంపిక చేయనున్నారు.

బరిలో 10 మంది

రెండు డైరెక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనుండగా, 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కార్పొరేట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ జీఎం ఎస్‌డీఎం సుభాని, మణుగూరు జీఎం జి.వెంకటేశ్వరరెడ్డి, కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ కమిటీ జీఎం దుర్గం రాంచందర్, క్వాలిటీ జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్, కార్పొరేట్ క్వాలిటీ జీఎం ఐనాల రవికుమార్, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ జీఎం ఎస్‌వీకె. శ్రీను, పర్చేజ్ జీఎం సుబ్బారావు, ఎస్టేట్స్ జీఎం డీఆర్ రవి ప్రసాద్, ఆర్జీ-2 ఏరియా జీఎం ఏ. మనోహర్, మందమర్రి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ డైరెక్టర్ పోస్టుల కోసం పోటీ పడుతున్నారు. కాగా బరిలో 10 మంది ఉన్నప్పటికీ ప్రధానంగా పోటీలో ముగ్గురే ఉన్నట్లు తెలుస్తోంది. జి.వెంకటేశ్వరరెడ్డి, దుర్గం రాంచందర్, ఎస్‌వీకే శ్రీను మధ్య ప్రధానంగా పోటీ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వారి బయోడేటా, స్టేటస్, పెర్ఫార్మెన్స్ వివరాలను సింగరేణి భవన్ ఉన్నతాధికారులు ఇటీవలే తీసుకున్నట్లు తెలిసింది. వారిలో ఇద్దరు మైనింగ్ గ్రాడ్యుయేట్లు కాగా, ఒకరు మాత్రం మైనింగ్ డిప్లొమా అభ్యర్థి అని సమాచారం. ఆ ముగ్గురిలో ఒకరిని ఆపరేషన్స్, మరొకరిని ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్‌గా ఎంపిక చేస్తారు.

వైభవంగా దివ్యోత్సవం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి



కాళ్లు లేకున్నా అద్భుత ప్రదర్శన ఇస్తున్న పాషా

- ఆడి, పాడిన దివ్యాంగ కళాకారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం(టీవీపీఎస్) ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం(దివ్యోత్సవం) వైభవంగా నిర్వహించారు. దేశభక్తియుత సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో తాము తక్కువ కాదని దివ్యాంగులు నిరూపించారు. ఈ వేదికపై సకలాంగుడైన వరుడు నరసింహారావుకు, దివ్యాంగురాలైన వధువు దీవెనతో వివాహం జరిపించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పొంగులేటి వధూవరులకు రూ. 5వేలతో పాటు దుస్తులు అందించారు. దివ్యోత్సవ కార్యక్రమానికి మరో రూ.25 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. అనేక సమస్యలతో బాధపడుతున్న దివ్యాంగులను ఆదుకోవాలన్నారు. దివ్యాంగుల కష్టాలలో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించడంతో పాటు తన పుట్టిన రోజు వేడుకను ఈ వేదికపైనే జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు, వధూవరులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంపీపీ బాదావత్ శాంతి, ఎంపీటీసీ భద్రమ్మ, ఉపసర్పంచ్ లగడపాటి రమేష్, నాగమణి, నాగరాజు, ప్రమీల దంపతులు, మొక్కల వెంకటయ్య, న్యాయవాది అరికల రవికుమార్, చదలవాడ ప్రకాష్, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్, షేక్ దస్తగిరి, మేడి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.